సాక్షి
యాదాద్రి భువనగిరి

గురువారం । 7 । ఆగస్టు । 2025



ముగిసిన పవిత్రోత్సవాలు
యాదగిరి క్షేత్రంలో మూడు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు బుధవారం పరిసమాప్తం అయ్యాయి. - 8లో



బ్లాక్ స్పాట్స్ గుర్తింపు
రోడ్డ ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్లను గుర్తించారు. - 9లో



తల్లిపాలు అమృతంతో సమానం
తల్లిపాలు అమృతంతో సమానమని, ఎన్నో పోషకాలుంటాయని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శిల్పిని పేర్కొన్నారు. - 9లో

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

భువనగిరి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు గురువారం జిల్లాకు రానున్నారు. ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి 7.10 గంటలకు బీబీనగర్‌కు చేరుకుంటారు. 7.30 గంటలకు యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం గుట్టలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ నివాసానికి వెళ్లనున్నారు. ఆ తరువాత చేనేత దినోత్సవం సందర్భంగా యాదగిరిగుట్టలో చేనేత సహకార సంఘంలో ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో పాల్గొంటారు. 11.45 గంటలకు భువనగిరికి వస్తారు. పట్టణంలోని ఎంఎస్ఆర్ గార్డెన్‌లో జరిగే జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు.

యాదగిరి క్షేత్రంలో సీసీ కెమెరాల పరిశీలన



సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు నిఘా నేత్రాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. అంతకుముందు ఆలయ ఈఓ వెంకట్‌రావును కలిసి భక్తులు, ఆలయ భద్రతపై చర్చించారు. ఆయన వెంట పట్టణ సీఐ భాస్కర్, ఎస్‌పీఎఫ్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేడు పోచంపల్లికి దత్తాత్రేయ రాక

భూదాన్‌పోచంపల్లి: హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గురువారం భూదాన్‌పోచంపల్లికి రానున్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత సహకార సంఘం భవనంలో చేనేత కార్మికులతో ముఖాముఖి సమావేశం నిర్వహించనున్నారు. అదేవిధంగా కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు పోచంపల్లి చేనేత సంఘం నాయకులు తెలిపారు.

గుట్టలో ఫుడ్ ఫెస్టివల్



వంటకాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

యాదగిరిగుట్ట: వంద రోజుల ప్రణాళికలో భాగంగా యాదగిరిగుట్ట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక అంగడిబజార్‌లో బుధవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. మహిళా సంఘాలు, మెప్మా సిబ్బంది, వీధి వ్యాపారులు ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు హాజరై వంటకాలను రుచి చూశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ లింగస్వామి, అధికారులు ఉన్నారు.



కలెక్టరేట్‌లో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు, అధికారులు

సార్ యాదిలో..

భువనగిరిటౌన్ : ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనకోసం తన తుదిశ్వాస వరకు పోరాడిన గొప్ప వ్యక్తి జయశంకర్ అని కలెక్టర్ కొనియాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్‌మోహన్‌ప్రసాద్, బీసీ సంక్షేమ అధికారి సాహితి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

'వరలక్ష్మి' సెల్ఫీలకు ఆహ్వానం

శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతం జరుపుకునే మహిళలూ.. మీ ఫొటోలను 'సాక్షి' పత్రికలో చూసుకోవాలనుకుంటున్నారా.. మీరు పూజలో కూర్చున్న ఫొటో సెల్ఫీ తీసి ఈ కింద నంబర్‌కు వాట్సప్ చేయండి. శనివారం సంచికలో ప్రచురిస్తాం. లేటెస్ట్ సెల్ఫీ ఫొటోతో పాటు మీ పేరు, చిరునామా కూడా పంపాలి.

సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నంబర్
80962 93702



చేనేతకు కొత్త బ్రాండ్

సృజనాత్మకతకు పెద్దపీట
- కాలానుగుణంగా నూతన డిజైన్ల రూపకల్పన
- దేశ, విదేశాల్లో చేనేతకు ఆదరణ
- యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు

నేడు జాతీయ చేనేత దినోత్సవం

యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లికి చెందిన ఈపూరి భాస్కర్ కెమికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసి ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. కరోనా లాక్‌డౌన్‌లో ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఐదు మగ్గాలు నిర్వహిస్తూ నూతన డిజైన్లతో పోచంపల్లి చేనేత చీరలు నేస్తున్నాడు. తనతో పాటు పది మందికి ఉపాధి కల్పిస్తున్నాడు. ఇటీవల హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలోని మైక్రోబయాలజీ విభాగంలో తిరిగి ఉద్యోగంలో చేరాడు. చేనేత వృత్తిని వీడలేక ఉద్యోగం చేస్తూనే కొనసాగిస్తున్నానని, కొత్తదనానికి ఎప్పటికీ ఆదరణ ఉంటుందని భాస్కర్ అంటున్నాడు.





సాక్షి,యాదాద్రి : సంప్రదాయ డిజైన్లకు ఫ్యాషన్‌ను జోడించి చేనేత ఉత్పత్తులకు ప్రపంచ ఖ్యాతి తెస్తోంది యువత. భూదాన్‌పోచంపల్లి, గద్వాల, సిద్దిపేట చేనేత.. కొత్తకళ సంతరించుకుంటోంది. సృజనాత్మకను జోడించడం ద్వారా చేనేత వస్త్రాలకు దేశ, విదేశాల్లో ఆధరణ పెరుగుతోంది. కొత్తతరం కూడా చేనేతపై దృష్టిసారించి అధునాతన డిజైన్లు రూపొందిస్తోంది. దేశవిదేశాల నుంచి కార్పొరేట్‌స్థాయిలో ఆర్డర్లు పొందుతున్నారు. ప్రభుత్వం చేనేత రంగాన్ని ప్రోత్సహించడానికి మరిన్ని నిధులు కేటాయించాలని నేతకార్మికులు కోరుతున్నారు.

చీరలపై అద్భుతాలు

చేనేత వస్త్రాలపై యువ చేనేత కళకారులు అద్భుతాలు సృష్టిస్తున్నారు. రంగులను మిక్సింగ్ చేసి కొత్త రంగుల షేడ్‌లను రాబడుతున్నారు.డిజైన్ల రూపకల్పనకు కంప్యూటర్‌లో క్యాడ్ యాడ్స్, ఆన్‌లైన్ ఇమేజెస్, కాంబోడియన్ డిజైన్స్‌ను వాడుతున్నారు. మేలిమి పట్టు దారం పడుగు,పేకల్లో ఇంచు ఇంచు డిజైన్‌లు తయారు చేసి పట్టు చీరలను ఇకో ఫ్రెండ్లీ డిజైన్స్‌తో రూపొందిస్తున్నారు.

టూ సైడ్ దూపట్టా..

ఇక్కత్ చీరలలో కన్పించే సంప్రదాయ డిజైన్ల రంగుల్లోంచి ఫేషియల్ కలర్స్, కలర్స్ షేడ్స్ గుర్తించి ఫ్యాషన్ డిజైన్ చీరలను తయారు చేసి దేశ విదేశాలలో విక్రయిస్తున్నారు. ప్రధానంగా పోచంపల్లి పట్టు చీర డిజైన్‌తో ట్విల్ ఇక్కత్ డిజైన్ చీరను వన్ గ్రామ్ గోల్డ్ జరీబార్డర్‌తో కొత్త ప్రయోగంతో కంచి జకార్డ్ బార్డర్ చీరలను తయారు చేయడం ఓ ప్రత్యేకత. తమిళనాడులో కంచికి చెందిన వస్త్ర వ్యాపారులు ఆర్డర్ల ద్వారా తయారు చేయిస్తున్నారు. ఒడిశాకు చెందిన కళాకృతులకు అద్దంపట్టే పోచంపల్లి డిజైన్‌ల ఇక్కత్ చీర రూపొందించారు. పేస్టల్ కలర్‌తో నేస్తున్న ఈ చీరలకు రెండు ఇంచుల రుద్రాక్ష బార్డర్ పట్టుదారంతోనే రూపొందించారు. చీర కొంగులో గొల్లభామ డిజైన్‌లు నేయడం ప్రత్యేకత. దేశంలో ఎక్కడా లేనివిధంగా టూ సైడ్ దూపట్ట చీరను జాతీయ అవార్డు గ్రహీత సాయిని భరత్ రూపొందించారు.

ప్రింటెడ్ బెడద

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన జియోగ్రాఫికల్ ఐడెంటిటీ(పేటెంట్ హక్కులు) ఉన్న పోచంపల్లి ఇక్కత్ , సిద్దిపేట గొల్లభామ, గద్వాల చీరలకు ప్రింటెండ్ బెడదతప్పడంలేదు. చేనేత వస్త్రాలైన పట్టు చీరలు, రుమాలు, కార్పెట్, బెడ్‌షీట్స్, మ్యాట్‌లను పవర్‌లూమ్‌పై తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. గొల్లభామ కొచ్చి, ఆంధ్రప్రదేశ్, పోచంపల్లి చేనేతలకు బెంగళూరు, సూరత్, తమిళనాడు, గద్వాల చీరలను తమిళనాడు,కర్ణాటకలో పవర్ లూమ్‌లపై డూప్లికేట్ తయారు చేస్తున్నారు. దీని వల్ల చేనేత బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోంది. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు 2003లో, గద్వాల చీరలకు 2009లో కేంద్ర ప్రభుత్వం జీయోగ్రాఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రీ(పేటెంట్) హక్కులను ఇచ్చింది. పోచంపల్లి చేనేత 11 డిజైన్లకు రిజర్వేషన్లు ఉన్నాయి. ఈచేనేతలను ఎవరైనా డూప్లీకేట్ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం ఏర్పాటు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారు.

సంప్రదాయ డిజైన్లకు ఫ్యాషన్ జోడించాలి



చేనేత రంగంలోకి వచ్చే యువతను ప్రోత్సహించాలి. ముఖ్యంగా నిఫ్ట్ ద్వారా నూతన డిజైన్లపై శిక్షణ ఇప్పించాలి. ఇక్కత్‌లో సంప్రదాయ డిజైన్లలో ఫ్యాషన్లను జోడించి వినూత్నంగా తయారు చేస్తే మార్కెటింగ్ అవకాశాలకు కొదవ ఉండదు. పోచంపల్లి ఇక్కత్ కు అంతర్జాతీయంగా పేరుంది. కానీ అందుకనుగుణంగా పబ్లిసిటీ లేదు. అందుకే ఎయిర్ హోస్టెస్ తప్పని సరిగా చేనేత వస్త్రాలు ధరించేలా చూడాలి. దేశంలోని ఎయిర్ పోర్టులు, రైల్వే స్టేషన్లు, ప్రధాన నగరాల్లో హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి హ్యాండ్లూమ్‌ను ప్రమోట్ చేయాలి. కల్యాణలక్ష్మి ఆర్థిక సహాయంతో పాటు పట్టు చీరను ప్రభుత్వం ఇవ్వాలి.

–సాయిని భరత్, కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్, పోచంపల్లి

గొల్లభామ చీరల కాపీ



గొల్లభామ చీరలకు సిద్దిపేట ప్రసిద్ధి. ఇక్కడ కాటన్, పట్టు గొల్లభామ చీరలను కొన్ని దశాబ్దాలుగా చేనేత కార్మికులు నేస్తున్నారు. కానీ ఇటీవల పవర్ లూమ్ సంస్థలు గొల్లభామ చీరలను కాపీ చేస్తున్నాయి. తక్కువ ధరకు అమ్ముతున్నారు. ఒక్క చీర నేయడానికి రూ. 1000 నుంచి రూ. 1500 కూలి ఇస్తున్నాం. అలాంటిది కాపీ చీరలను మార్కెట్ లో తక్కువ కు అమ్ముతున్నారు. ఇది మార్కెట్ మీద ప్రభావం పడుతోంది.

–తుమ్మ ప్రవీణ్, సిద్దిపేట, గొల్లభామ చీరల వ్యాపారి

పోచంపల్లి చీరలకు మంచి డిమాండ్



పోచంపల్లి ఇక్కత్ చీరల డిజైన్‌లు, కలర్స్ చాలా బెస్ట్‌గా ఉంటాయి. కుటీర పరిశ్రమలా ఇక్కడే చీరలను తయారు చేస్తారు. క్వాలిటీ, కలర్స్,డిజైన్‌లు మనసును హత్తుకునేలా ఉన్నాయి. ఇక్కడ కొత్తదనం ఎప్పుడు ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో చేనేత వస్త్రాలకు మంచి డిమాండ్ ఉంది. నేసే వారి దగ్గర చీరలు కొనుగోలుచేయడం ఎంతో సంతోషంగా ఉంటుంది.

–ప్రవళిక, ఆన్‌లైన్ చీరల వ్యాపారి, మెహదీపట్నం, హైదరాబాద్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



దూదివెంకటాపురం గ్రామసభలో కలెక్టర్ హనుమంతరావు, అధికారులు

- కలెక్టర్ హనుమంతరావు
- దూదివెంకటాపురంలో పల్లెనిద్ర

రాజాపేట : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం రాజాపేట మండలంలోని దూదివెంకటాపురంలో పల్లెనిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.తాగునీరు, రవాణా సౌకర్యం, విద్య, వైద్యం, ఉపాధిహామీ పనులు, మహిళా సంఘాలకు రుణాలు, రేషన్‌కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు, రెవెన్యూ, విద్యుత్ తదితర పథకాలు అమలుతీరుపై చర్చించారు. కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తన దృష్టికి వచ్చిన సమస్యలన్నింటినీ త్వరిగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్ కల్లా విద్యుత్ సబ్ స్టేషన్, హెల్త్ సబ్‌సెంటర్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే డెలివరీలు చేయించుకోవాలని, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎదురయ్యే ఇబ్బందులను గ్రామస్తులకు తెలియజేశారు. అనంతరం గ్రామంలోనే బస చేశారు. గురువారం ఉదయం గ్రామంలో తిరిగి సమస్యలు తెలుసుకుంటానని, వనోమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం ఉంటుందని, ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీపీఓ సునంద, ఎక్సైజ్ సూపరింటెండెంట్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిగా కలెక్టర్..

బీబీనగర్: కలెక్టర్ హనుమంతరావు విద్యార్థిగా మారారు. తరగతి గదిలో కాసేపు విద్యార్థులతో కలిసి కూర్చొని ఉపాధ్యాయుడు బోధిస్తుండగా పాఠం విన్నారు. బీబీనగర్ మండలం గూడూరులోని జిల్లా పరిషత్ పాఠశాల, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్‌ను బుధవారం ఆయన సందర్శించారు. 10వ తరగతికి వెళ్లి విద్యార్థులతో కలిసి జువాలజీ పాఠం విన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి సులువైన రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. 10వ తరగతి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు సైకిళ్లు బహుమతిగా అందజేస్తానని కలెక్టర్ తెలిపారు.



టెన్త్ విద్యార్థులతో కలిసి పాఠం వింటున్న కలెక్టర్

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి



అధికారులతో సమావేశమైన జెడ్పీ సీఈఓ

ఆత్మకూరు(ఎం): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని జెడ్పీ సీఈఓ శోభారాణి అధికారులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమం ఏర్పాటు చేశారు. నోటిఫికేషన్ ఎప్పుడొచ్చినా ఎన్నికలు నిర్వహించేలా సామగ్రిని సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల పనులు త్వరితగతిన పూర్తయ్యేలా లబ్ధిదారులకు సహకరించాలని కోరారు. ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులు ఉంటే గుర్తించి కారణాలు తెలుసుకోవాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులున్న వారికి మహిళా సంఘాల నుంచి రుణాలు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాములునాయక్, ఎంపీఓ పద్మావతి, సూపరింటెండెంట్ ఎలిమినేటి లోకేశ్వర్‌రెడ్డి, ఏపీఓ రమేష్ పాల్గొన్నారు.

అక్రమాలపై కొనసాగిన విచారణ

- సీఎంఆర్, ధాన్యం కొనుగోళ్లు, చెల్లింపులపై రికార్డుల పరిశీలన

సాక్షి,యాదాద్రి: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై సివిల్ సప్లై విజిలెన్స్ విభాగం, ఎన్‌ఫోర్స్‌మెట్ అధికారులు చేపట్టిన విచారణ బుధవారం మూడో రోజు కొనసాగింది. కలెక్టరేట్‌లోని సివిల్ సప్‌లై కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. వలిగొండ మండలం సంగెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో లావాదేవీలకు సంబంధించిన రికార్డులను విచారణ అధికారులు పరిశీలించారు. ట్రక్‌షీట్లు, రైతులకు బిల్లుల చెల్లింపునకు సంబంధించిన రిజిస్టర్ జిరాక్స్ ప్రతులు తీసుకున్నారు. ట్రక్ షీట్లలో రైతుల పేర్ల మార్పు, చెల్లింపులు తదితర వాటిపై సివిల్ సప్‌లై కార్పొరేషన్ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని విచారించారు. అలాగే బీబీనగ్ మండలంలోని రుద్రవెల్లి, చినరావులపల్లి, రాఘవాపురంతో పాటు మరికొన్ని గ్రామాల పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల ద్వారా జరిగిన కొనుగోళ్ల వివరాలు సేకరించారు.



వలిగొండలోని రైస్ మిల్లులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సీఎంఆర్‌పైనా..

కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) బకాయిలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేశారు. సీజన్ వారీగా మిల్లర్లకు అప్పగించిన ధాన్యం, మిల్లర్లు ప్రభుత్వానికి ఇచ్చిన సీఎంఆర్ వివరాలు సేకరించారు.

100 రోజులు పని కల్పించాలి

రాజాపేట: ప్రతి కూలీకి 100 రోజు పనిదినాలు కల్పించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేష్ సూచించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రాజాపేట మండలంలో నిర్వహించిన ఉపాధిహామీ పనులపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని స్పష్టం చేశారు. పనుల కొలతల్లో వ్యత్యాసం ఉండటంతో టెక్నికల్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ఉపేందర్‌రెడ్డి, మేనేజర్ ఆదిత్యవర్ధన్, ఎంపీడీఓ నాగవేణి, ఈసీ కర్ణాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రామీణాభివృద్ధి అధికారి సురేష్

పొంగిన వాగులు

రెండు గంటల పాటు భారీ వర్షం

- అత్యధికంగా పోచంపల్లిలో 99 మి.మీ
- వాగులకు పోటెత్తిన వరద
- ముక్తాపూర్‌లో పాఠశాల తరగతి గదుల్లోకి వెళ్లిన నీరు
- నేడు, రేపూ వర్షాలు
- పలు మండలాలకు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు



మోటకొండూరు మండలం చాడ- చందెపల్లి మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న బిక్కేరు వాగు

భువనగిరిటౌన్ : జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. రెండు గంటల పాటు కురిసిన వర్షానికి వాగులు పొంగిపొర్లాయి. పలు చోట్ల లోలెవల్ వంతెనల పైనుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. అత్యధికంగా భూదాన్‌పోచంపల్లిలో 99.3 మి.మీ, మోటకొండూరు 63మి.మీ, చౌటప్పుల్ 49మి.మీ, భువనగిరి 47మి.మీ, బీబీనగర్ 20మి.మీ, వలిగొండ 14 మి.మీ, బొమ్మలరామారం 10 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 3.39 సెంటీ మీటర్ల వర్షం కురిసిందని, ఈ సీజన్‌లో ఇదే అధిక వర్షపాతం . రానున్న రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశ ఉండటంతో పలు మండలాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

భూదాన్‌పోచంపల్లి: మండల వ్యాప్తంగా వర్షం దంచికొట్టింది. సుమారు రెండుగంటల పాటు వర్షం కురిసింది. దాంతో చిన్నేరుకు వరద ఉధృతి పెరిగి మెహర్‌నగర్–జలాల్‌పురం మధ్య ఉన్న లోలెవల్ బ్రిడ్జి పైనుంచి ప్రవహించింది. వరదనీటితో భారీగా గుర్రపుడెక్కకు కొట్టుకొచ్చి బ్రిడ్జి పై చేరింది. ఫలితంగా రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం మెహర్‌నగర్ గ్రామస్తులు జేసీబీతో బ్రిడ్జిపైన చేరిన గుర్రపుడెక్కను తొలగించారు. పంటపొలాలకు వచ్చే కాలువకు వరద ఉధృతి పెరిగి ముక్తాపూర్ ప్రభుత్వ పాఠశాల తరగతి గదుల్లోకి నీరు చేరింది. పోచంపల్లి జెడ్పీ స్కూల్ ఆవరణలో భారీగా వర్షపునీరు నిలిచి మడుగును తలపించింది. అలాగే కిచెన్ గార్డెన్‌ను వరద నీరు ముంచెత్తింది.



ఆత్మకూర్(ఎం) వద్ద బిక్కేరు వాగులో వరదను పరిశీలించి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

మోటకొండూర్: వర్షానికి మోటకొండూర్ మండల కేంద్రంలోని పెద్దవాగు, కాటేపల్లి, చాడ, కొండాపూర్ గ్రామాల పరిధిలో బిక్కేరు వాగుకు వరద ఉధృతి పెరిగింది. దీంతో మోటకొండూర్ – సికింద్రనగర్, కాటేపల్లి–సికింద్రనగర్, చందేపల్లి–చాడ, కొండాపురం–కాల్వపల్లి గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రయాణికులు చుట్టూ తిరిగి గమ్య స్థానాలకు చేరుకున్నారు.

ఆత్మకూరు(ఎం): మండల పరిధిలో బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మొరిపిరాల, కొరటికల్, పోతిరెడ్డిపల్లి, టి. రేపాక కాజ్‌వేల పైనుంచి వరద ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి.చెక్ డ్యాంలు పూర్తిగా నిండి అలుగుపోస్తున్నాయి. ఎంపీడీఓ రాములునాయక్, సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి శేఖర్‌లు సందర్శించి ప్రజలకు సూచనలు చేశారు.



మోటకొండూర్ పెద్దవాగులో వరద ప్రవాహం



మెహర్‌నగర్-జలాల్‌పురం మధ్య లోలెవల్ బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న వాగు



భూదాన్‌పోచంపల్లి మండలం ముక్తాపూర్ పాఠశాల ఆవరణలో చేరిన వర్షపు నీరు

క్లుప్తంగా

నారుమడిపై కలుపు మందు పిచికారీ



రత్నవరంలో నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరం గ్రామానికి చెందిన గుండు సుభద్ర వ్యవసాయ క్షేత్రంలోని వరి నారుమడిపై గుర్తు తెలియని వ్యక్తులు కలుపు మందు పిచికారీ చేశారు. దీంతో ఆమె బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కంపాసాగర్ వ్యవసాయ పరిశోధన స్థానానికి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్.చంద్రశేఖర్, డాక్టర్ సంధ్యారాణిలను పిలిపించి, నారుమడిని పరిశీలించి, పొలంలోని నారు, మట్టి నమూనాలు సేకరించినట్లు ఎస్‌ఐ గందమళ్ల అజయ్ కుమార్ తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్, ఏఈఓ ఉప్పయ్య ఉన్నారు.

ఆర్ఎంపీ వైద్యుడిపై కేసు నమోదు

మునగాల: మునగాల మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు చంద్రమౌళి చేసిన చికిత్స వికటించడంతోనే బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన గోవింద వెంకటేశ్వర్లు(35) మృతిచెందాడని ఆయన సోదరుడు వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. వెంకటేశ్వర్లు గత మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా అతడి భార్య శిరీష మంగళవారం మండల కేంద్రంలోని ఆర్ఎంపీ వైద్యుడు చంద్రమౌళి క్లినిక్‌కు చికిత్స నిమిత్తం తీసుకువచ్చింది. చికిత్స పొందుతుండగా వెంకటేశ్వర్లు పరిస్థితి విషమించడంతో ఆయన సోదరుడు వీరబాబు సాయంతో కోదాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని కోదాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గల మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు చెప్పారు. మునగాలతో పాటు మృతుడి స్వగ్రామమైన బరాఖత్‌గూడెంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మహేందర్ (ఫైల్)

చింతపల్లి: అప్పుల బాధతో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం చింతపల్లి మండల పరిధిలోని వింజమూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వింజమూర్ గ్రామానికి చెందిన భీనమోని మహేందర్ (35)గ్రామంలో వ్యవసాయ పనులతో పాటు డ్రైవర్ గా చేస్తూ జీవనం సాగించేవాడు. తెలిసిన వారి వద్ద అప్పులు చేసి, వాటిని తీర్చే మార్గం లేక మానసికంగా కుంగిపోయాడు. దిక్కుతోచని స్థితిలో గత నెల 25న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. బంధువులు గమనించి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య నవీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

కృష్ణా తీరాన శైవ క్షేత్రం



పెద్దమునిగల్‌లోని కృష్ణా తీరంలో ఏర్పాటు చేసిన మహాశివుడి విగ్రహం

- ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పెద్దమునిగల్‌లోని కృష్ణా తీరం
- నాలుగేళ్లుగా గంగా హారతి

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని పెద్దమునిగల్ కృష్ణా తీరంలో మహా శివుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గ్రామస్తులు విరాళాల రూపంలో రూ.50లక్షలు సేకరించి శివాలయాన్ని నిర్మించి, మహాశివుడి ప్రతిమ ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా ఇక్కడ గంగా హారతి నిర్వహిస్తుంటారు. కార్తీక మాసంలో ఇక్కడ ప్రత్యేక పూజలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఒక వైపు కృష్ణా హారతి.. మరో వైపు మహా శివునికి ప్రత్యేక పూజలతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. కృష్ణా తీరంలోని వైజాగ్ కాలనీ అందాలు వీక్షించేందుకు వెళ్లే పర్యాటకులు పెద్దమునిగల్ కృష్ణా తీరాన గల మహాశివుని దేవాలయాన్ని సైతం దర్శించుకుంటుండడంతో భక్తుల రద్దీ పెరుగుతోంది.

గంగా హారతి ఇక్కడి ప్రత్యేకత

కార్తీక మాసంలో ప్రతి ఏడాది ఇక్కడ శివుడికి నిర్వహించే గంగా హారతి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. గ్రామస్తులందరం కలిసి సుమారు రూ.50లక్షలు విరాళాలు సేకరించి, మహాశివుడి దేవాలయాన్ని నిర్మించుకున్నాం. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతం గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతుంది.

– కోతి యుగేంధర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

విద్య నేర్పుతూ.. కళను పంచుతూ..



తిప్పర్తి పాఠశాలలో గోడలపై గీసిన చిత్రాలు

- విద్యార్థులకు చదువుతోపాటు చిత్రలేఖనం, యోగా, కోలాటంలో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

నా కళను విద్యార్థులకు పంచుతున్నా



నాకు చిన్నతనం నుంచి చిత్రలేఖనం ఎంతో ఇష్టం. నేను పనిచేస్తున్న పాఠశాలతో పాటు వేరే పాఠశాలల్లో విద్యార్థులకు అర్థమయ్యేలా చిత్రాలను గీశాను. రాజకీయ నాయకులు, దేశ నాయకులు చిత్రాలను గీసి వారికి బహుమతులుగా అందజేశాను.

– వెంకటేశ్వర్లు, తిప్పర్తి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు

తిప్పర్తి: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు తనకున్న కళను విద్యార్థులకు పంచుతున్నాడు తిప్పర్తి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు జల్లెల వెంకటేశ్వర్లు. చిత్రలేఖనం ద్వారా అర్థమయ్యే రీతిలో విద్యా బుద్ధులు నేర్పించడంతోపాటు, యోగా, కోలాటం తదితర రంగాల్లో విద్యార్థులకు మెళకువలు నేర్పుతూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

ఉద్యోగం వచ్చిన నాటి నుంచి నేటి వరకు..

గత 24 సంవత్సరాల సర్వీసులో ఇప్పటి వరకు మూడు పాఠశాలల్లో పనిచేశారు. ప్రథమంగా యాదగిరిగుట్ట మండలం యాదగిరిపల్లి గ్రామం నుంచి తన ఉద్యోగ ప్రస్థానం మొదలు పెట్టారు. అక్కడ నుంచి అనుముల మండల కుపాస్‌పల్లిలో చేశాడు. ప్రస్తుతం తిప్పర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. 27 పాఠశాలలో చిత్రాలు గీశారు. తాను పనిచేసిన పాఠశాలలోనే కాకుండా ఇతర పాఠశాలలకు కూడా ఆహ్వానం మేరకు వెళ్లి చిత్రాలు గీశారు. 2021లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యారు. రాష్ట్ర కార్టూన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన గీసిన చిత్రాలు పాఠ్యపుస్తకాల్లో ప్రచురితమయ్యాయి. పీవీ నర్సింహరావు శత జయంతి సందర్భంగా ఆయన గీసిన చిత్రానికి 2023లో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో అవార్డు అందుకున్నారు. అదేవిధంగా వెంకటేశ్వర్లు గీసిన చిత్రాలు ఆస్ట్రేలియాలో తెలుగు అసోసియేషన్ రూపొందించిన 2024 క్యాలెండర్‌లో ప్రచురితమయ్యాయి.

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక అక్రమ డంపింగ్

మోత్కూరు : మోత్కూరులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో కొంత మంది ట్రాక్టర్ల యజమానులు ఇసుకను అక్రమంగా డంపింగ్ చేస్తున్నారు. పాటిమట్ల గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల కోసం సదర్శాపురం బిక్కేరు నుంచి ఇసుకను తీసుకువచ్చేందుకు తహసీల్దార్ అనుమతులు పొంది వాటికి అదనంగా తరలిస్తూ రహస్య ప్రాంతాల్లో అక్రమంగా డంపింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఇసుకను రాత్రి వేళల్లో లారీల ద్వారా తరలించేందుకు పాటిమట్ల కొత్త కాలనీ వద్ద ఇసుక డంపింగ్ చేశారని, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పాటిమట్ల, సదర్శాపూర్ గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.



పాటిమట్ల కొత్త కాలనీలో అక్రమంగా డంపింగ్ చేసిన ఇసుక

ముగిసిన పవిత్రోత్సవాలు



ఉత్సవమూర్తులు, పవిత్ర మాలలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న అర్చకులు, ఈఓ, అనువంశిక ధర్మకర్త

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు బుధవారం పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా ముగిశాయి. ఈ నెల 4వ తేదీన ఆలయంలో శ్రీస్వామి వారి పవిత్రోత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టారు. రెండ్రోజుల పాటు ఆలయంలో వివిధ పూజలు నిర్వహించిన అర్చకులు, బుధవారం ఉదయం ప్రాకార మండపంలోని యజ్ఞశాలలో హోమాది పూజలు జరిపించి, మహా పూర్ణాహుతి చేపట్టారు. ఉదయం 8.30గంటల నుంచి ద్వార తోరణ, ధ్వజ కుంభారాధన, చతుఃస్థానార్చన, మూలమంత్ర, పరివార శాంతి, ప్రాయశ్చిత హోమం, శాలాబలి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను, పవిత్రమాలలను ఊరేగింపుగా ప్రధానాలయానికి తీసుకెళ్లారు. స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులు, సువర్ణ పుష్పార్చన ఉత్సవమూర్తులు, ఆళ్వారులకు పవిత్ర మాలలను ధరింపజేసి, ప్రత్యేక పూజలు చేపట్టారు. వేడుకల్లో ఆలయ ఈఓ వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, అర్చకులు, పారాయణీకులు, పండితులు, ఉద్యోగులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. పాతగుట్ట ఆలయంలో సైతం పవిత్రోత్సవాలను వైభవంగా ముగించారు.



ఆలయ యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

నేటి నుంచి నిత్యపూజలు పునఃప్రారంభం

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో జరిగిన పవిత్రోత్సవాల సందర్భంగా మంగళ, బుధ వారాల్లో శాశ్వత, నిత్య కల్యాణం, సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం వంటి పూజలను ఆలయ అధికారులు రద్దు చేశారు. పవిత్రోత్సవాలు ముగిసిన నేపథ్యంలో గురువారం నుంచి ఈ పుజలను పునఃప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

హ్యాండ్లూమ్ స్టాల్‌ను సందర్శించిన మంత్రులు

సంస్థాన్ నారాయణపురం: చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూఢిల్లీలో గజం నర్మద హ్యాండ్లూమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను బుధవారం కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, ఢిల్లీ రాష్ట్ర మంత్రి పవిత్ర మార్గరీట వేర్వేరుగా సందర్శించారు. వస్త్రాలను మార్కెటింగ్ చేస్తున్న విధానంపై అడిగి తెలుసుకున్నారు. తయారీ, మార్కెటింగ్, అవార్డు తదితర అంశాలను చేనేత జౌళి శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ వారికి వివరించారు.



స్టాల్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్

స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- భువనగిరి కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి : స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్ రావుతో కలసి అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేడుకలు నిర్వహిస్తున్నందున అందుకు అనుగుణంగా వేదిక, వీఐపీలు, అధికారులకు, ఇతరులకు అనుకూలంగా సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, ఆర్డీఓ కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామలింగం పాల్గొన్నారు.

రసాయన, ఔషధ ఫ్యాక్టరీలు తనిఖీ చేయాలి

జిల్లాలోని అన్ని రసాయన, ఔషధ ఫ్యాక్టరీలను తనిఖీ చేయాలని కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, జిల్లా ఫైర్ ఆఫీసర్, ఇండస్ట్రీస్ ఆఫీసర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా పాశ మైలారం ప్రాంతంలో జూన్‌లో జరిగిన భారీ విస్ఫోటన ఘటనకు గురైన తర్వాత భద్రతా సమస్యలపై చర్చించారు. జిల్లాలోని పరిశ్రమ పురోగతిని సమీక్షించేందుకు 19వ తేదీన రివ్యూ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

• తరగతి గదుల్లోకి వర్షపు నీరు





భూదాన్‌పోచంపల్లి : యాదాద్రి భువనగిరి జిల్లాలోని బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ పాఠశాల తరగతి గదిలోకి చేరిన వర్షపు నీరు

నాగాయపల్లిలో మద్యపాన నిషేధం



మద్యపాన నిషేధం తీర్మాన పత్రాన్ని చూపుతున్న గ్రామస్తులు

తుర్కపల్లి(యాదగిరిగుట్ట రూరల్): తుర్కపల్లి మండలం నాగాయపల్లి, నాగయపల్లితండాలో మద్యపాన నేషేధానికి గ్రామస్తులు బుధవారం తీర్మానం చేశారు. ఇకపై గ్రామంలో, తండాలో మద్యం అమ్మకాలు అనుమతించబోని స్పష్టం చేశారు. మద్యం వల్ల కుటుంబాలు ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడుతున్నాయని.. మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఎవరైనా మద్యం విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు రూ.100000 జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో బుధవారం బస్సు ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దండుమల్కాపురం గ్రామ శివారులో జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపునకు వెళ్తున్న ఏపీకి చెందిన బస్సు ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

చౌటుప్పల్ : చౌటుప్పల్‌లో బుధవారం వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా యాచారం గ్రామానికి చెందిన పాశం వంశీ(40) అనారోగ్యానికి గురవడంతో చికిత్స నిమిత్తం సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లాడు. అక్కడ చికిత్స పొందిన మరుసటి రోజు మంగళవారం చౌటుప్పల్‌లోని తన అత్తగారి ఇంటికి వెళ్లాడు. అదే రోజు తెల్లవారుజామున బాత్‌రూమ్ కోసమని వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో అతడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ టీం దాడులు

భువనగిరిటౌన్ : భువనగిరి టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ టీం బుధవారం భువనగిరి పట్టణంలోని చేపట్టిన దాడుల్లో 70 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు భువనగిరి పట్టణంలోని బ్రహ్మణవాడ నివాసం ఉంటున్న కాసీం షేఖ్ ఇంట్లో దాడులు నిర్వహించారు. ఖాసీం షేఖ్ గంజాయిని వెస్ట్ బెంగాల్ నుంచి తీసుకువచ్చిన భువనగిరిలో విక్రయించేవాడని పోలీసులు గుర్తించారు. అతడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రాధాకృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, టీం బృందం నర్సిరెడ్డి, దుర్గయ్య, లింగస్వామి, నిహారిక, సురేష్ తనిఖీల్లో తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ చెస్ ఛాంపియన్ ఆనంద్‌ను కలిసిన కరుణాకర్‌రెడ్డి



చెస్ ఛాంపియన్‌షిప్ ఆనంద్ కుటుంబ సభ్యులతో కరుణాకర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ సాధించిన విశ్వనాథ్ ఆనంద్‌ను జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కొసనం కరుణాకర్ రెడ్డి బుధవారం చెన్నైలో కలిశారు. చెన్నైలో జరిగిన చెస్ ఎగ్జిబిషన్ నేపథ్యంలో ఆయన అక్కడకు వెళ్లారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో చెస్ క్రీడాకారుడి పేరు మీద స్టేడియం ఏర్పాటు చేయడం అభినందనీయమని, త్వరలోనే తాను స్టేడియం సందర్శిస్తానని ఆనంద్ చెప్పినట్లు కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

ఫ్లైఓవర్‌కు పగుళ్లు



ఫ్లైఓవర్ స్లాబ్‌కు ఏర్పడిన పగుళ్లు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని పాతగుట్ట చౌరస్తా నుంచి వైకుంఠద్వారం వరకు వేసిన ఫ్లైఓవర్‌కు పగుళ్లు ఏర్పడ్డాయి. రోడ్డు విస్తరణలో భాగంగా గత ప్రభుత్వం భక్తులకు ఇబ్బందులు తలెత్తవద్దనే ఉద్దేశంతో రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఫ్లైఓవర్‌ను నిర్మించింది. ఫ్లైఓవర్ అండర్ పాస్ నుంచి గాంధీ నగర్‌కు వెళ్లే దారిలో స్లాబ్‌కు పగుళ్లు రావడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి పెట్టి, ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఊరంతా వెదజల్లే పద్ధతిలోనే వరి సాగు

- భిన్నంగా ఆలోచించిన నడిగూడెం మండలం రామాపురం గ్రామ రైతులు
- పెట్టుబడి ఖర్చులు తగ్గి కూలీల కొరత లేదంటున్న అన్నదాతలు



నడిగూడెం మండలం రామాపురంలో వరి విత్తనాలు వెదజల్లుతున్న రైతులు

పొలంపంట

నడిగూడెం: కాలానుగుణంగా వ్యవసాయంలో ఎప్పటికప్పుడు అనేక మార్పులు వస్తున్నాయి. ఇటీవలి కాలంలో వరి సాగులో ఖర్చులు పెరగడంతో పాటు కూలీల కొరత తీవ్రంగా ఉంది. దీంతో విత్తనాలు వేసే దగ్గర నుంచి ఎరువుల వాడకం, కలుపు తీయడం, పంట కోసే వరకు ఒక్కో రైతు ఒక్కో విధంగా వ్యవసాయం చేస్తున్నారు. కానీ సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామాపుంర గ్రామ రైతులు మాత్రం అందుకు భిన్నం. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రామాపురం రైతులు వరి సాగు భిన్నంగా చేపట్టారు. దమ్ము చేసిన పొలంలో మొలకెత్తిన వరి విత్తనాలను నేరుగా చల్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు ఏకంగా ఊళ్లోని రైతులంతా వెదజల్లే పద్ధతిలోనే వరి సాగు చేస్తున్నారు. రామాపురంలో బోర్లు, బావులు, సాగర్ ఎడమ కాల్వకు అనుబంధంగా కొమరబండ మేజర్ కాల్వ, ఆర్–9 ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటి సౌకర్యం ఉంది. ఉన్న నీటి వనరులతో ఏకంగా ఆ ఊరంతా దాదాపు 3500 ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలోనే వరి సాగు చేస్తున్నారు. ఈ విధానంలో వారం రోజుల ముందుగానే పంట కోతకు వస్తుందని, నారు పెంపకం, నారు పీకడం, నాట్లు వేసే పని ఉండదు కాబట్టి సాగు ఖర్చు రూ.2500 నుంచి రూ.3500 వరకు తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. ఈ విధానంలో ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనం సరిపోతుంది. ఈ పద్ధతిలో కాండం ధృడంగా పెరుగుతుందని, రైతుకు ఇష్టమైన ఏ రకమైనా సాగు చేసుకోవచ్చని, నీటి యాజమాన్యం కూడా చాలా సులువు అని వ్యవసాయాధికారులు అంటున్నారు.

మూడెకరాల్లోనూ వెదజల్లే పద్ధతిలో..



మూడెకరాల్లో వరి సాగు చేపట్టాను. అది కూడా వెదజల్లే పద్ధతిలో నేరుగా వరి విత్తనాలు చల్లాను. దీంతో విత్తన మోతాదు, నారు పెంచే ఖర్చులు, నాట్లు వేసే ఖర్చులు తగ్గాయి. దాదాపు రూ.3000 వరకు ఆదా అయ్యాయి. కూలీల సమస్య కూడా లేదు.

– మారిశెట్టి నర్సింహారావు, రైతు, రామాపురం

వెదజల్లే పద్ధతి చాలా సులువు



రోజురోజుకూ వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు ముందుకు వెళ్లాలి. దమ్ము చేసిన తర్వాత నేరుగా పొలంలో విత్తనాలు వెదజల్లడం వలన మొక్క ధృడంగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. కూలీల సమస్యను కూడా అధిగమించవచ్చు.

– రాయపు దేవప్రసాద్, మండల వ్యవసాయాధికారి, నడిగూడెం